# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 19-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఎన్నికల అనంతరం జరిగిన ఘర్షణల దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్‌లను విడిగా సీసాల్లో విక్రయించరాదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.**

**2.** **రాష్ట్రంలో కరవు ప్రభావిత ప్రాంతాల్లో ఈనెల 24వ తేదీలోపు పంట నష్టం గణన పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ సి. హెచ్. హరికిరణ్ అధికారులను ఆదేశించారు.**

**3.** **వేసవి రద్దీ దృష్ట్యా రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు.**

**4.** **ఐపీఎల్ క్రికెట్‌లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య ఈ మధ్యాహ్నం హైదరాబాద్‌లో మ్యాచ్ ప్రారంభం కానుంది.**

**5.** **ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన ఘర్షణల దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్‌లను విడిగా సీసాల్లో విక్రయించరాదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఈమేరకు అన్ని పెట్రో బంక్ డీలర్లకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పెట్రోల్ బంకులపై నిరంతరం ఫ్లైయింగ్ స్క్వాడ్ నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్షిప్ లైసెన్స్‌లు రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపింది. పెట్రోల్ బంకుల్లో ఎన్నికల సంఘం ఆదేశాలను ప్రదర్శించడమే కాక ఘర్షణలకు పాల్పడే వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

---------------------------

రాష్ట్రంలో రబీ పంట కాలానికి సంబంధించి కరవు ప్రభావిత ప్రాంతాల్లో ఈనెల 24వ తేదీలోగా పంటనష్టం గణన పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ సి. హెచ్. హరికిరణ్ ఆదేశించారు. రబీ పంట కాలానికి సంబంధించి అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 87 కరవు మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మండలాల్లో 33 శాతానికిపైగా దెబ్బతిని, నష్టపోయిన వివరాలను పంటల వారీగా రూపొందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలా తయారు చేసిన జాబితాలను

ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కింద ప్రదర్శించాలని, తుది జాబితాలను 31వ తేదీలోగా జిల్లా కలెక్టర్ల ద్వారా పంపించాలని ఆదేశించారు.

-------------------------

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలను పంపిణీ చేసేందుకు గ్రామ సచివాలయాల సిబ్బందికి ప్రభుత్వం ప్రత్యేకంగా అదనపు బాధ్యతలను అప్పగించింది. విత్తనాల పంపిణీకి గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లకు అదనంగా గ్రామ సచివాలయాల్లో పనిచేసే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌ల సేవలను వినియోగించుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సమర్ధవంతంగా, వేగంగా రైతులకు విత్తనాల పంపిణీకి అదనపు సిబ్బంది అవసరమంటూ గ్రామ, వార్డు సచివాలయాల శాఖను వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ కోరడంతో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

-------------------------

వేసవి రద్దీ దృష్ట్యా రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. సంబల్‌పూర్-కాచిగూడ ప్రత్యేక రైలు సంబల్‌పూర్‌లో ప్రతీ సోమవారం రాత్రి 9 గంటలకు బయల్దేరి దువ్వాడ మీదుగా కాచిగూడ చేరుకుంటుందని, ఈ ప్రత్యేక రైలు జూన్ 24వ తేదీ వరకు నడుస్తుందని తెలిపారు. సంబల్‌పూర్-బెంగళూరు ప్రత్యేక రైలు ప్రతీ గురువారం సాయంత్రం 6 గంటల 45 నిమిషాలకు సంబల్‌పూర్‌లో బయల్దేరి దువ్వాడ మీదుగా బెంగళూరు చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో బెంగళూరు-సంబల్‌పూర్ రైలు ప్రతీ శనివారం తెల్లవారుజామున ఒంటి గంటా 15 నిమిషాలకు బెంగుళూరులో బయల్దేరి దువ్వాడ మీదుగా సంబల్‌పూర్ చేరుకుంటుందని, ఈ ప్రత్యేక రైళ్లు జూన్ 29వ తేదీ వరకు నడుస్తాయని పేర్కొన్నారు.

-------------------------

పాస్ పోర్టు కార్యాలయం అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండే నకిలీ వెబ్‌సైట్ల పట్ల పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంశాఖ హెచ్చరించింది. ఈ వెబ్‌సైట్ల ద్వారా పౌరుల వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాలు, ఆధార్, పాన్ కార్డు వంటి కీలక పత్రాలను సేకరిస్తున్నట్టు పేర్కొంది. వీటిని ఉపయోగించి ఆర్థిక మోసాలకు పాల్పడే అవకాశం ఉందని హోంశాఖ అధికారులు తెలిపారు. పాస్ పోర్టు కొత్తగా తీసుకునేందుకు, అప్డేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలో సదరు వెబ్‌సైట్‌ను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించింది. అధికారిక వెబ్ సైట్ తరహాలోనే కొద్దిపాటి అక్షరాల మార్పులతో ఈ వెబ్‌సైట్‌ను మోసపూరితంగా రూపొందిస్తున్నట్లు పేర్కొంది. పాస్ పోర్టు కార్యాలయం అధికారిక వెబ్‌సైట్ www.passportindia.gov.inను మాత్రమే పాస్ పోర్టుకు సంబంధించిన అంశాల కోసం వినియోగించాలని సంబంధిత అధికారులు సూచించారు.

-------------------------

రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఆర్థిక నిబంధనల ప్రకారమే బిల్లులు చెల్లిస్తున్నామని రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మొత్తం 7 వేల 546.34 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. వీటిలో ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల కోసం 5 వేల 868.26 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 600.44 కోట్ల రూపాయలు చెల్లించినట్లు వివరించారు. రుణాల చెల్లింపుకు 458.84 కోట్లు,

జీతాలు, పింఛన్ల చెల్లింపుకు 289.23 కోట్లు, పాలనాపరమైన ఖర్చులకు 289.23 కోట్లు, విద్యుత్తు రాయితీలకు 161.82 కోట్ల రూపాయలు చెల్లించినట్లు తెలియజేశారు.

---------------------------

వ్యర్థ పదార్థాలతో పంట పొలాలలోనే సేంద్రీయ ఎరువును తయారు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, ప్రధాన శాస్త్రవేత్త డా. సి. హెచ్ శ్రీనివాస్ తెలియచేశారు. జాతీయ సేవా పథకం ప్రణాళికలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా దొమ్మేరు గ్రామంలో మట్టినమూనాల సేకరణ, క్షేత్ర సందర్శన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పశువులు, కూరగాయలు, వ్యవసాయానికి సంబంధించిన వ్యర్థాలను కుళ్లబెట్టే ప్రక్రియ ద్వారా కంపోస్ట్ ఎరువును తయారు చేయవచ్చని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో ఉన్నవారు కూడా సేంద్రీయ ఎరువును సులభంగా తయారు చేసుకోవచ్చని తెలిపారు.

---------------------------

ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నేడు జరుపుకుంటున్నాం. 1913 మే 1వ తేదీన నెల్లూరులో జన్మించిన ఆయన కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. ప్రజా ప్రతినిధులుగా ఉంటూ నిరాడంబరతతో కూడి ఆదర్శ జీవితం గడిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ ఆయన పాల్గొన్నారు. పార్లమెంటు సభ్యులుగా పనిచేసిన సమయంలో ఆయన సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్తూ అనేక మంది రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడిగా నిలిచారు. పుచ్చలపల్లి సుందరయ్య 1985 మే 19వ తేదీన కన్నుమూశారు.

---------------------------

ఈనెల 24 నుండి జరిగే ఇంటర్మీడియట్, పదవ తరగతి అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరావు తెలిపారు. బాపట్లలో అధికారులతో సప్లిమెంటరీ పరీక్షల సన్నాహక సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుండి జూన్ 3 వ తేదీ వరకు జరిగే పదవ తరగతి అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 11 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేశామని 7 వేల 384 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 9 వేల 579 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంటులో భాగంగా ఈ మధ్యాహ్నం హైదరాబాద్ వేదికగా సన్ రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది. కాగా నిన్న బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు, చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై 27 పరుగుల తేడాతో విజయం సాధించింది.

---------------------------

ఈనెల 22వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది ఉత్తర ఈశాన్యం దిశగా ప్రయాణించి, మధ్య బంగాళాఖాతంలో 24 నాటికల్లా వాయుగుండంగా బలపడుతుందని భారత వాతావరణశాఖ

తెలిపింది.  దీని ప్రభావం రాష్ట్రమంతా ఉంటుందని, అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఇప్పటికే ఛత్తీస్‌ఘడ్ , కర్ణాటక, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం వల్ల రాయలసీమలో ఈరోజు  భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మూడు రోజుల పాటు ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. వైఎస్సార్ కడప, పశ్చిమ  ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు.

======================